# అడుక్కు తినేవాడూ, అప్పైకుంటే నేను



**మహానగరంలో** ఓ బారుమహాల్. మానవాళి నిచ్చెనలో అట్టడుగు మెట్టు!

చేతిలో ఓ అల్యూమినియం గిన్నె, ఒంటిలో తోలు ముద్దలా ఉన్న ఓ బోరె.

అడుక్కుతినేవాడు అలా పోతున్నాడు, ఓ గుమ్మం

దగ్గిరనించి ఇంకో గుమ్మం దగ్గిరికి.

అద్దెకుండేవాడికంటే నువ్వే నయంరా అబ్బాయ్! పొద్దున్నే లేస్తావు, మునిసిపల్ నల్లా దగ్గిర మొహం కడుక్కుంటావు, గిన్నె జోలె పట్టుకుని వీథి వెంట పడతావు. పదకొండు గంటలదాకా ముష్టెత్తుకుంటావు. అన్నం, ఇంత ఆవకాయబద్దా పడేసే అన్నపూర్ణ ఒక్కర్తి కాకపోతే ఒక్కర్తయినా ఉంటుంది. బియ్యం వేసేవాళ్ళు బియ్యం వేస్తారు. సిద్ధాన్నం తిని హాయిగా ఏ చెట్టుకిందో పడుకుంటావు మూడు గంటలదాకా. మళ్ళీ పొద్దున్న కార్యక్రమాన్నే సాయంత్రం కూడా కొనసాగిస్తావు. లేకపోయినా ఫరవాలేదు. పొద్దున్న అంతా దండుకున్న బియ్యం ఉండనే ఉన్నాయి.

నువ్వు బ్రహ్మచారి ముష్టివాడివో, సంసారి ముష్టివాడివో తెలియదు కాని, సంసారి ముష్టివాడివైతే ఇంకా అదృష్టమే. నువ్వు ఓ వీథిలోకి వెళతావు. నీ పెళ్ళాం ఇంకో వీథిలోకి, నీ పెద్దపిల్ల మరో చోటికి, కొడుకు ఇంకో చోటికి — ఇలా నలుగురూ కలిసి నగరాన్ని పంచుకుని, చక్కగా సాయంత్రం అయ్యేటప్పటికల్లా నాలుగైదు కిలోల బియ్యం అయినా సంపాయించుకుంటారు. పొద్దుకుంకే వేళకు అందరూ రోడ్డువార ఓ పెద్ద మర్రిచెట్టుకిందో ఓ సత్రం అరుగుమీదకో చేరి, నాలుగు కంకరరాళ్ళు పెద్దవి ఏరి పొయ్యిలా పేర్చుకుని, చెట్టుకింద రాలిన చితుకుల్ని ఏరి తెచ్చుకుని, ఇంత ఉడకబెట్టుకుని, ఏ పచ్చిమిరపకాయో ఉల్లిపాయో నంజుకుని, తిని, గుండెల మీద చెయ్యి వేసుకుని పడుకుని నిద్రపోతారు హాయిగా!

ఉండటానికి అద్దెకొంప దొరకలేదని బెంగా? నెలాఖరు వస్తుంది, కిరాయ్‌కోసం కిరాతకుడు వస్తాడు, ఎలా అని భయమా?

ఈ పిల్లకు స్కూలుఫీజు కట్టాలి. ఆ కుర్రాడికి పుస్తకాలు కొనలేదు. ఆఫీసుకు పోవటానికి చేతిలో పైసలు లేవు — ఈ చింతా చీకూ లేవుకదా నీకు!

మా మధ్యతరగతి మనుషుల్ని చూడు. ఒక చెయ్యి తెస్తూంటే, పదినోళ్ళు మేస్తూంటాయి!

మూడో తరగతివాళ్ళలా గుడిసెలలో ఉండలేం. మొదటి తరగతివాళ్ళు మా వాసనే దగ్గిరికి రానీయరు.

పొద్దుటినించి కాళ్ళు పడిపోయేలా తిరుగుతున్నాను. ఎక్కే గుమ్మం. దిగే గుమ్మం. కాని, ఎక్కడా! ప్చ్!

ఇంత పెద్ద మేడ కదా అని, తల దాచుకుందుకు కాస్తంత ఔట్‌హౌసయినాదొరక్కపోతుందా కిరాయ్‌కని ఆశపడి గేటు తలుపు తీసుకుని లోపలికి వెళ్ళితే, అల్సేషియన్ కుక్క అమాంతంగా మీది కురుకుతుంది హడిలి చచ్చేలా! పైగా "కాంపౌండులోపలికి ఎవడు రమ్మన్నా?" డంటూ అల్సేషియన్‌ను వెనకేసుకు వస్తాడు ఓ పెద్దమనిషి!

అవును మరి. ఆరు నెలలనించేకాదు, ఆరేళ్ళనించి ఆ అల్సేషియన్‌తో సహవాసం చేస్తున్నాడు ఆ పెద్దమనిషి! అలా వెనకేసుకు వచ్చాడూ అంటే, ఆయన దోషం ఏం ఉంది, పాపం?

" 'టు లెట్' బోర్డు లేకపోయినా, ఎందుకలా ఓనర్స్ చేస్తూ, నిద్దరోతుంటే?" అని నిద్ర మొహాన నిప్పులు కురిపిస్తాడు ఇంకో బుద్ధిమంతుడు!

మనిషై పుట్టిన ప్రతివాడికి ఉండడానికి నాది అని చెప్పుకొనే ఇల్లు ఏర్పడే పుణ్యకాలం ఎప్పటికి వస్తుందో ఎవరికీ తెలియదు. అద్దెకు ఇల్లు, కనీసం ఒకవాటా అయినా సంపాదించడానికి పడే పాట్లు పడ్డవాడికీ, పెరుమాళ్ళకూ మాత్రమే తెలుసు. ఇంతా అయినా సుఖానికి నోచుకోదు ప్రాణి గౌరవం అసలే ఉండదు. అద్దెకు ఉండేవాడికన్న అడుక్కుతినేవాడే మేలేమో అనిపిస్తే ఆశ్చర్యం ఏముంటుంది?

# అడుక్కు తినేవాడు, అద్దెకుండే నేను

## అవసరాల నారాయణరావు

"పిల్లకి వేళాపాళా లేదు. 'అయ్యో! భోజనాలే చేస్తున్నారో, భుక్తాయాసమే తీర్చుకుంటున్నారో, బంధువులతో రాచకార్యాలే మాట్లాడుకుంటున్నారో' అనే మంచీ చెడ్డా లేదు! 'ఏమండీ, ఇందులో కిరాయ్ కిచ్చేది ఉందా? కిరాయికండీ!' ఒకటే పాట" అని ఓ పెట్టిపుట్టిన మహా ఇల్లాలు సాగదీసుకుంటుంది. పోనీలే. అద్దెకుండేవాడి పుట్టుక పుట్టాం. అభిమానం చంపుకోకపోతే ఎలా అని సర్దుకున్నాను. ఆడజన్మ కంటే, అడుక్కుతినేవాడి పుట్టుకకంటే అధ్వాన్నం అనిపించింది అద్దెకుండేవాడి బ్రతుకు.

అడుక్కుతినేవాడు అలా మరో ఇంటికి వెళ్ళాడు.

వాడు ఖాళీ చేసిన గడపముందే నేనూ! వాడి అడుగుజాడల్లో నా పాదాలు! ఎటొచ్చీ, నా చేతిలో అల్యూమినియం గిన్నీ, చంకలో జోలెమాత్రం లేవు. అదే మాకు తేడా.

అక్కడ నుంచునే, తడకతలుపు తప్పించి, "ఏమండీ! ఇందులో ఏమైనా కిరాయి కిచ్చేది ఉందా?" అన్నాను.

"ఎవరూ?" అంటూ లోపలినుంచి బొట్టూ, జుట్టూ లేని ఒక ఆవిడ నాముందు ప్రత్యక్షం అయింది. ఇంచుమించు యాభై ఏళ్ళుంటాయి. మల్లు పంచె కట్టుకుంది. చెవుల వెనకనించి గుండు మీద ముసుగు.

నన్ను ఎగాదిగా ఓసారి చూసి, "ఎవరు మీరూ?" అంది ముసుగు కొంచెం ముందుకు లాక్కుంటూ.

అది ఆవిడ మొదటి ప్రశ్న.

అడగగానే అందరిదగ్గిరనించీ వచ్చినట్లు ఆమె నోటినించి కూడా 'లేదూ' అన్న పాసు శబ్దం ఎప్పుడైతే రాలేదో 'ఉందీ!' అనే ధైర్యం వచ్చింది నాలో. హమ్మయ్య! అని తేలికపడి, 'మన కష్టాలు గట్టెక్కిపోయాయిలే' అనుకున్నాను.

నా కర్థం కాలేదు, ఆవిడ అడుగుతున్న దేమిటో. ఆడా, మగా అనా? లేకపోతే బ్రాహ్మలా శూద్రులా అనా? అదీ కాకపోతే బ్రహ్మచారులా, సంసారులా అనా? నేను తెల్లబోయి చూసేసరికి ఆవిడగారికి అర్థం అయింది కాబోలు. "శాకాహారులా? మాంసాహారులా?" అంది చటుక్కున.

కులం ఏమిటో సూటిగా అడిగితే బాగుండదని కాబోసు ఈ కొత్త టెక్నిక్! బ్రాహ్మలు మాంసాహారం మరగకూడదా? శూద్రులు కేవలం కాయగూరలమీదే బ్రతకకూడదా? ఏమైనప్పటికీ, ఆవిడ అంత లోతుకు పోనందుకు అభినందించాను నా లోపల్లోపలే.

"బ్రాహ్మలమేనమ్మా" అన్నాను.

అంతటితో వదిలిపెట్టలేదావిడ. అందులో మళ్ళీ శాఖలూ, పలవలూ కావలిసివచ్చాయి.

"వెలనాట్లా? వ్యాపార్లా?" మరో ప్రశ్న.

"వెలనాట్లం" అన్నాను.

"ఆఁ అలాగా! మీ ఇంటిపేరూ?" ఆశ్చర్యంగా అడిగిందామె ఎందుకోగాని.

మా ఇంటిపేరు చెప్పి, "మీ ఇంటిపేరేమిటమ్మా?" అని అడిగాను.

ఏదోలా, వీలైతే మెల్లిగా వాళ్ళ ముత్తాత మా ముత్తాత ఒకే కంచంలో తిని, ఒకే మంచంమీద పడుకున్నారని కోసి, 'మనకీ మనకీ బీరకాయపీచు' అందామని నా ఉద్దేశం. అబ్బే, ఆవిడెక్కడ! పెద్ద ఆరిందా. అంత తేలిగ్గా పడనిస్తుందా!

మాట మార్చేసి, "ఎంతమంది పిల్లలు?" అంది.

చెప్పాను.

ఎక్కడ పనిచేస్తున్నావని అడిగింది.

చెప్పాను.

జీతం ఎంతంది.

చెప్పాను.

ఇంటర్వ్యూలో అధికారిలా ప్రశ్నమీద ప్రశ్న వేసేస్తుంది అయినవీ, కానివీనూ.

సొంత ఊరు ఏ ఊరంది.

చెప్పాను.

"తల్లీ తండ్రీ ఉన్నారా?" అంది.

"నిక్షేపంలా" అన్నాను.

"అన్నదమ్ము లెంతమంది? అప్పచెల్లెళ్ళు ఎంతమంది?"

'అధిక ప్రసంగం! ఎదురుకో!' అంది నా అంతరాత్మ.

అనువుకాని చోట ఆగ్రహం అనర్థదాయకం అని అంతరాత్మను జోకొట్టాను. ఏ కళ నున్నదో కాని పాపం అంతరాత్మ అణగారిపోయింది.

జవాబు చెప్పాను ఆవిడ అడిగిన ప్రశ్నకు.

"ఎంత అద్దె ఇవ్వగలవు నాయనా?" అంది ఆఖరికి.

హమ్మయ్య! అసలు విషయానికి వచ్చింది కదా అని తేలికపడి, "నలభైకి, యాభైకి మధ్య" అన్నాను, అనవసరంగా తొందరపడి.

నేనిచ్చే అద్దె, నా కిచ్చే వాటానుబట్టి ఉంటుందా, లేకపోతే నా జీతం స్తోమతులమీద ఆధారపడిఉంటుందా? ఏమో! సమయానికి పాడుబుర్ర మందగించిపోయింది.

క్షణంసేపాలోచించి, "సరే" అని, కూడా రమ్మని లోపలికి తీసుకువెళ్ళింది ఆవిడ.

"ఇది పడక గది." ఓ గదిలో కాలుపెడుతూ, నాకు పరిచయం చేసింది ఆవిడ.

నేను దారి తడుముకుంటూ, గదిలో అడుగుపెట్టి, పడిపోబోయి, నిలదొక్కుకున్నాను. గుమ్మం ఎత్తుకి గది ఒక అడుగు లోతున ఉంది. పడిపోవలసినవాణ్ణే.

"ఇప్పుడే వెలుతురులోనించి వచ్చావు కాదూ నాయనా! వెలుతురులోనించి వచ్చిన వెంటనే చీకటిని చూడటానికి ఇంకా అలవాటు పడలేదులా ఉంది కళ్ళు!" అంది తత్వాన్ని ఆ దిబ్బ.

'అమ్మో! చాలా పెద్ద ఆరిందాలా ఉందీవిడ. సైన్సులోకూడా అంతో ఇంతో పరిచయం ఉందీవిడకి' అని మనసులో అనుకుని, గదిచుట్టూ ఓసారి పరీక్షగా చూశాను, కళ్ళు ఓసారి నులుముకుని.

నేనలా చూడడంలో ఆవిడ కేమి సుఫరించిందోకాని, గబుక్కున అందుకుంది.

"కిటికీలు లేవని నీ మనసు కిరికిరి చేస్తోంది, అవునా? కాని, ఒక్కటాలోచించటం లేదు నువ్వు. వర్షాకాలం వచ్చినా జల్లు కొట్టదు! శీతాకాలం చలి వెయ్యమన్నా వెయ్యదు. ఈ రోజులు రగ్గులూ, బొగ్గులూ కొనుక్కునేలా ఉన్నాయా నాయనా? ఇహ వేసంకాలంలో అంతా ఆరుబయటే పడుకుంటాం గదా."

ఆవిడ తర్కానికి ఏమనాలో తెలియక, తికమకపడి, "అవునండి! అవునండి!" అని వంతపాడి, గది అంతా మరోసారి కలియజూశాను.

ఒక్క తావు తంతే ఊడిపోయేలా తలుపులు! పైన పొగ చూరిపోయిన టిన్‌రేకు! గోడలకి ఎక్కడ చూసినా కన్నాలు!

అక్కడక్కడా మనిషి స్పర్శ తగలనిచోట తెల్లగా, మిగతాచోట పేసురురంగులో, బొల్లి ఉన్నవాడి ఒళ్ళులా ఉన్నాయి గోడలు!

ఇల్లు ఇంత చండాలంగా ఉందేం అని కాని, ఈ కన్నాలన్నీ ఎవరు కొట్టారని కాని నేను అడగలేదు సుమండీ! ఆవిడే తనంతట తానుగా చెప్పుకుపోయింది.

"ఈ కన్నాలన్నీ కిరాయికున్నవాళ్ళు కొట్టినవే నాయనా! కిరాయి ఇస్తున్నంత కాలము, వాళ్ళ మేకులకీ మన కే హక్కూ లేదుకదా! న్యాయానికీ, ధర్మానికీ కట్టుబడాలి, మనిషన్నాక!"

ధర్మరాజును చంపి పుట్టింది ఆవిడ.

చిన్న నవ్వు నవ్వి ఊరుకున్నాను. అంతకంటే అద్దె కుండేవాడు ఏమనగలడు? ఆఫీసులో అధికారినైనా ఎదిరించి నిలబడవచ్చు! చెడిపోతే, కాన్ఫిడెన్షియల్ రిపోర్టు ఒకటి చెడిపోతుంది. కాని, కిరాయి కొంప కావలసినవాడు ఇల్లు కలవాణ్ణి మాత్రం వల్లెత్తు మాట అంటే ఇంకేమైనా ఉందా!

"ఇలా రా. నాయనా! ఇదిగో ఇది వంటగది" అంటూ ఇంకో గదిలోకి తీసుకు వెళ్ళింది.

గచ్చంతా పెచ్చుపెచ్చులుగా ఊడిపోయి, తామర ఉన్నవాడి ఒళ్ళులా ఉంది! గోడంతా చౌడుదేరిపోయింది. పైన ఎక్కడ చూసినా తోరణాల్లా వేళ్ళాడుతూ బూజులు! మూలల్లో సాలెగూళ్ళు! ఉంటూన్నప్పుడేవో కట్టి, వెళ్ళిపోయేటప్పుడు తెంపుకుపోగా మిగిలి, దూలాన్ని పట్టుకు వేళాడుతూన్న పొగచూరిపోయిన చేంతాడు ముక్కలు!

బాలనాగమ్మ సినిమాలో ఆ క్రూరుడు మాయల మరాఠీ ప్రాణం ఉన్న చిలకకోసం చెట్టు తొర్రలోనూ అక్కడా దూరడం, ఆ దూరినప్పుడు లోపల కనిపించే ఆ భయంకరమైన దృశ్యాలూ అవీ కళ్ళకు కట్టినట్టు అనిపించాయి నాకు. ఎటొచ్చీ అదిరిపడేలా పెద్ద పెద్ద ధ్వనులు లేవు!

"నల్లా ఉందాండీ?" అన్నాను, వంట ఇంట్లోనించి బయటపడుతూ.

"నల్లా అంటే నాకు తలనెప్పి నాయనా! కారణం ఏమని అడుగుతావేమో చెప్పనా?

"శుభ్రత అంటే పడిచస్తాను నేను. ముప్పొద్దులా, ముప్పయ్ నలభై బాల్చీల నీళ్ళు భళ్ళున మీద ఒంపు కుంటేనేగాని, పోసుకున్నట్టుండదు నాకు.

"కాకపోయినా వంటిపిల్లాడి చెంబుకి ఉండే రబ్బరు తిత్తిలోంచి వచ్చే పాలల్లా సన్నని ధార తీసుకుతీసుకు పడుతూంటే, మా చెడ్డ ఒళ్ళు మండుకుపోతుంది నాకు. అలా అయితే, పని ఎప్పటికి కానూ? పోనీ, అదైనా పొద్దల్లా పడుతుందా? పొద్దున్నో గంటా! సాయంత్రం ఓ గంటా! ఏం సుఖం చెప్పు? పైగా నల్లాలో వచ్చే నీళ్ళల్లో ఏవేవో మందులు కూడా కలుపుతారట! రోగాలన్నీ ఎలా వస్తున్నాయంటావూ మరి? అందుకే, చూడు నాయనా! స్వచ్ఛమైన బావి నీరు శరీరాని కారోగ్యం. ఎన్ని రోగాలున్నా ఎగిరి చచ్చిపోతాయ్. కొబ్బరికాయ నీళ్ళలా ఎంత తియ్యగా ఉంటాయనీ, మా బావివి! ఈ చుట్టుపక్కల వాళ్ళందరికీ మా బావినీళ్ళే! కొంచెం నోట్లో పోసుకుని చూడు. తోడి ఇస్తాను, కావాలంటే."

నన్ను ఫూల్‌ని చెయ్యటానికి ఎంత సాహసం ఈవిడకి! మునిసిపాలిటీవాళ్ళూ, కార్పొరేషన్‌వాళ్ళూ ప్రజల క్షేమం కోరి, సరఫరా చేసేముందు నీళ్ళు క్లోరినేట్ చేస్తూంటే, ఏవో మందులు కలుపుతున్నారుట! వాటివల్ల రోగాలు వస్తున్నాయిట! వారేవా!

"బాత్‌రూం ఎక్కడ?" అలాంటిది ఎక్కడా ఉన్నట్టు కనిపించక అడిగాను.

"నాయనా, ఈ రోజుల్లో అంత రాణీవాసం చేసే వాళ్ళెవరున్నారు చెప్పూ? ఏదో ఓ చిన్న గుడ్డ చుట్టబెట్టుకుని, నేనూ, మా అమ్మాయీ మాత్రం బావి దగ్గరే పోసుకుంటాం సుమా! అంతకు ముందుండే వాళ్ళుకూడా అంతే."

తూచితూచి వాడుతుంది మాటలు! ఎక్కడ ఏమాట వేస్తే తన పాయింటుకు సిమెంటు కాంక్రీటు అవుతుందో సరిగ్గా అదే పదం వాడుతుంది! గొప్ప సమయస్ఫూర్తి!

మగవాళ్ళమాట ఎలా ఉన్నా, ఆడవాళ్ళు బాత్‌రూంలో స్నానం చెయ్యటం రాణీవాసం అనిపించుకుంటుందా, తన మాటకారితనంతో పసిపూసి మారేడుకాయ చెయ్యాలనుకోవటం కాకపోతే!

"పాయిఖానా ఎక్కడ?"

"అదిగో ఆ మూల చిన్న గదిలా ఉందే, అదీ!" చూపుడు వేలితో ఓ మూల చూపించింది ఆవిడ.

"పింగాణీ రకమా?" అన్నాను ఉచ్చతెనుగులో.

ఆవిడ దానికి సమాధానంగా, "కాదు, ఎతి పోసుకునేదే, నాయనా?" అంది.

నాకు నవ్వాగలేదు, ఆవిడ ప్రయోగించిన పదానికి.

# జీవనాడి

## పోచిరాజు శేషగిరిరావు

జీవితమున సాధించిన దేమిటి?
పౌరుషమున గడియించిన దేమిటి?
సంగీతము సాహిత్యము
పురోహితుని చేతికపిలె
ఆచారము నిలుపుటకా!
అంతరాత్మ కప్పుటకా!

నిత్య సత్య లోకమ్మున
నిప్పు వంటి నిజమునకే
నిలువ నీడ లేనప్పుడు
దేనికి ఈ జడ జగమ్ము?

ఊహా లోకమ్ములోన
విహరించుచు—వాస్తవమ్ము
చూడని ఈ కవి పథికుడు
ఎచటి కేగగలడు నేడు?

ప్రకృతికాంత విలాసమ్ము
చూచి మురియు రస పిపాసి:
శ్రీకాంతా దరహాసము
చే మరచును మేనాకండు.

సూత్రమ్ములు వల్లింతురు
ధర్మమ్ములు ప్రవచింతురు
అభియోగమ్ములు తీర్తురు
తమ సంగతి తడవ రెపుడు

పెదవిపైన చిరునవ్వులు
ఎదలోపల అగ్నిరవలు
నాటకమ్మె జీవితమ్ము
రసమెక్కడ! రంగ మెచట!

నాందినుండి భరత వాక్య
మగుదాకా నటియింతురు
నటకులు రంగమ్మునందు—
బ్రదుకంతా నాటకమా!
హాహా! హాహా! ఏమి లీల!

నైతిక మూల్యము శూన్యము
ధనమొక్కటె ప్రధానమ్ము
అయినప్పుడు, సంస్కారము
పెరుగుత్రోవ కన్పడునా?

మానవునకు మమత మెండు
నిర్మముడై నిలువలేడు
నిలుచుటకును నీడ కూడ
ఖరీదయ్యె—ఏమి ప్రగతి? ★

ఒకవేళ ఇక్కడ అలా వాడతారేమో అనుకున్నాను.

"కిరాయి ఎంత, బామ్మగారూ?" అన్నాను ఆదుర్దాగా.

"అంతా ఇచ్చినట్లే నాయనా. మీ దగ్గిర ఎక్కువ పుచ్చుకుంటానా? ఇంతకు ముందుండేవాళ్ళు కిరాయి యాభై రూపాయ లిచ్చేవాళ్ళు. కరెంటుకి బల్బుకి రెండు రూపాయలు. పాకీదానికి రూపాయి. మొత్తం యాభై అయిదు."

'దారుణం!' అనుకుని నేను కనుబొమ లెగరేశాను ఆశ్చర్యంతో.

అది ఆవిడ పసిగట్టినట్లుంది.

"ఈ ఊళ్లో అద్దెకుండేవాడు ఖాళీ చేసినప్పుడల్లా అయిదూ, పదీ పెంచుతారు కిరాయి. కాని, మేం అలాంటివాళ్ళం కాదు, నాయనా. ధర్మం కాయాలి! దేవుడు చూడాలి! అంతే కానీ. . . ." అమాంతంగా రెండు చేతులూ పైకెత్తి జోడించిందావిడ, సూర్య నమస్కారం చేసినట్లు.

ఈ రోజుల్లో ఈ లోకంలో 'అధర్మం' అనే తోడేలు 'ధర్మం' అనే మేకతోలు కప్పుకుని, మందలో పడి సొంతం మింగవచ్చు!

నే నేమీ మాట్లాడలేదు. మళ్ళీ ఆవిడే అందుకుంది.

"అద్దె ఎక్కువని అనుకోకు, నాయనా. అన్నీ సదుపాయాలూ ఉన్నాయి. కాయగూరల మార్కెట్టు దగ్గిర. సిటీ బస్ మన గుమ్మంలోనే ఆగుతుంది. ఆ కనిపించేదే రైలు స్టేషను. ఈ రోడ్డు మలుపు తిరిగితే బస్సుస్టాండు. మీ పిల్లలకు బడి ఆ పక్కనే. ఆఫీసు లన్నింటికీ దగ్గిర.

"ఆ ప్రసాదరావు పదేళ్లనించి ఉన్నాడు మా ఇంట్లో. బదిలీ అయిపోయి వెళ్ళిపోయేటప్పుడు, ఇల్లు వదిలిపెట్టి పోలేక, అతగాడికి కళ్ళు చెమ్మగిల్లిపోయాయి! పాపం. మొగుడూ పెళ్ళాం చాల మంచివాళ్ళు. ఉన్న మాట చెప్పుకోవాలి. ఎలా ఉంటే అలా గడుపుకు పోయేవాళ్ళు."

# అడుక్కు తినేవాడు...

దానికి నే నేమీ మాట్లాడలేదు. మళ్ళీ ఆవిడే ఎత్తుకుంది.

"నువ్వు తీసుకోదలుచుకుంటే, ఓ నెల అడ్వాన్సు ఇచ్చిపో నాయనా. ఎందుకంటావా? ఇప్పుడు చూసిన ఇల్లు ఇంకో పదియు పోయాక వస్తే, ఉండదు. ఓ పక్క ఇంకుస్థాపన అవుతూంటే ఇంకో పక్క అడ్వాన్సు లిచ్చి పోతున్నారు! ఈ ఊళ్ళో అంత కటకటగా ఉంది కొంపలకి! ఇప్పుడే అర్ధగంట క్రితం ఎవరోవచ్చి వెళ్లారు, ఇప్పుడే వస్తాం ఎవ్వరికీ మాట ఇవ్వద్దని మరీమరీ చెప్పి.

"గొప్ప చెప్పుకోవటం కాదు కానీ, మా ఇంట్లో ఎవరున్నా, ఎంత కాలం ఉన్నా, చిన్న పిల్లల దగ్గిరనించి పెద్దవాళ్ళదాకా ఎప్పుడూ కూడా చీకుచింత పడలేదంటే నమ్ము!" గర్వంగా చూసింది ఆవిడ నా మొహంలోకి. కాంప్లిమెంటుదైనా ఒకటి విసురుతానని కాబోసు!

'ఈ రేకు కొంపకు యాభై రూపాయలా!? ఈవిడ అతి మంచిపోనూ!' అని లోపల్లోపలే ఆవిణ్ణి ఓసారి శపించేసి, పైకి నవ్వేశాను.

గ్రహించినట్లుంది దిబ్బ!

"అయ్యో, నాయనా! ఈ ఊళ్లో పరిస్థితి నీకు తెలియకుండా ఉంది. ఎక్కడైనా విచారించి చూడు. ఇవే వాటాకి ఇంకొకరైతే డబ్బైలా, ఎనభైలా అడుగుతారు. మా కొద్దు నాయనా, అంత అన్యాయం! వెధవ పాపిష్టి డబ్బు!"

హారేరామ్, 'న్యాయం', 'ధర్మం' అనే పవిత్రమైన పదాలకు కూడా ఎంత గడ్డు రోజులు వచ్చాయి!

చెట్టుకొమ్మమీద చిన్న గూడు కట్టుకుని కాపరం చేసే పక్షులూ, పాకలో రాటకు కట్టబడ్డ పశువులూ ఎన్నో రెట్లు మేలు. వాటికి కావలసినంత గాలి, వెలుతురూనూ!

కాని ఈ గద్దిలాల సూక్ష్మం మానవమాత్రులు ఉండతగ్గదేనా? ఊహించుకుంటుంటే దడ పుట్టింది నాకు! కాని, ఏం చెయ్యటం? అటు వెళ్ళి, ఇటు వచ్చేసరికి ఇదీ జారిపోతుందేమో?

వెతికి వెతికి ఎక్కడో అక్కడ ఇంత ఉద్యోగాన్ని సంపాదించవచ్చు! పదిమంది ఆడపిల్లలకు పెళ్ళి సంబంధాలు తేవచ్చు! కాని, అద్దెకొంప మాత్రం అంత సులువుగా సంపాదించటమే!

అంతలోనే తడక దగ్గిర పిధిలోంచి అరుపు. "ఏమండీ, ఇందులో కిరాయికి మకాన్ ఉందా?"

నా గుండె బేజారైపోయింది. ఎవడో వస్తున్నాడు, నా చేతిలో ఉన్నది కాస్తా గద్దలా తన్నుకుపోవటానికి! క్యూలల్లోనూ, రేసుల్లోనూ, బిజినెస్‌లోనూ అంటే పోటీ అర్థం ఉంది కాని, అద్దె కొంపలకు కూడా ఇంత పోటా పోటీ అయితే ఎక్కడ చస్తాం?

'ఇంకా ఆలోచిస్తా వేమిటి? ఏదో ఒకటీ, తల దాచుకుందుకు. తొందరపడు! ఊఁ.' అంతరాత్మ ముల్లు గ్రుచ్చిలా పొడిచింది.

రైలుకీ, బస్సుకీ లేళమించి వెళ్ళవచ్చు! ప్రమోషన్ సీవ పెళ్ళామంటే కూడా 'వెళ్ళవచ్చు లెద్దూ' అని బుజ్జగించి అలసత చూపించవచ్చు! కాని, అద్దెకొంపకు అడ్వాన్సు ఇవ్వటంలో అలసత అయితే కొంప మునిగి పోదూ?

పునరాలోచన చెయ్యకుండా జేబులో చెయ్యిపెట్టి అయిదు పదులు తీసి ఆవిడ చేతిలో పెట్టాను.

పువ్వుకుని కళ్ళ కద్దుకుంది ఆవిడ.

"రెండు మూడు రోజుల్లో మంచిదినం చూసి దిగుతాం. ఈలోపలో వెల్లా అదీ వేయించండి" అన్నాను, ఇహ వెళ్ళిపోదాం కదా అని.

"మొన్న సంక్రాంతికే వేయించాను. మనిషి మారినప్పుడల్లా వెల్లి వేయించటానికి నావల్ల కాదు."

అద్దెకున్నవాళ్లు మారినప్పుడల్లా కిరాయి పెంచవచ్చు కాని, వెల్ల వేయించకూడదు!

పైసలు చేతిలో పడగానే ఆవిడ కంఠంలో అంతకు ముందుండే మెత్తదనం, మాటల్లో ఉండే మంచితనం, తియ్యదనం ఒక్కసారిగా మాయమైపోయాయి చిటికలో! అప్పటి కప్పుడే అదో రకం కరుకుతనం వచ్చేసింది! దిక్కుమాలిన రోజులు!

"ఇంకో విషయం!" ఆవిడ ఇంకా ఏదో చెప్పబోతూంది.


అంతవరకూ సంబోధించేటప్పుడు ఆవిడ వాడిన 'నాయనా, బాబూ' అనే అనునయ పదజాలాలు ఇప్పుడు ఎక్కడికి పోయాయో, ఏమైపోయాయో! పొడిపొడిగా, బోడిబోడిగా సంబోధించటం మొదలు పెట్టింది ఆవిడ.

"పడక గదిలో నలభయ్యో నంబరు బల్బూ, వంట గదిలో ఇరవై అయిదో నంబరు బల్బూ మాత్రమే పెట్టుకోవాలి. బల్బులు మీవే!

"ఎంతో అవసరం అయితేనే గాని ఎవరూ ఎక్కువ కాల్చరు. అయినా అయిదూ, పది నిమిషాలు అటూ ఇటూ అయితే మాత్రం ఏమంత మహాభాగ్యం కానీ, మా ఇంట్లో పదైతేనేగాని లైట్లే వెయ్యం! తొమ్మిది

జంట విహారం

చిత్రం—ఆర్. సిద్ధిరాం (సికిందరాబాదు)



గంటలయ్యేటప్పటికల్లా రెండో ఝామ నిద్రలో ఉంటాం. మళ్ళీ భళ్ళున తెల్లారితేనేగాని, ముసుగు తీసేది లేము. మేం చేసుకున్న పుణ్యం ఏమిటో గాని, మా ఇంటికి ఎవరువచ్చినాకూడా,వాళ్లకీ అన్నీ మా అలవాట్లే!

"అప్పుడప్పుడు మావారు అంటూండేవారు, 'కరెంట్ చాలా క్లుప్తంగా వాడుకోవాలి. పరిశ్రమలకీ వాటికీ అది వెన్నెముక! దేశంలో ఉత్పత్తి ఎక్కువై, దేశం బాగుపడాలంటే అన్నింటితోపాటు కరెంటుకూడా పొదుపు చెయ్యటం నేర్చుకోవాలి!' అని.

"నే నిలా అంటున్నానని తప్పు పట్టుకోవద్దు. ఏదో సందర్భం వచ్చింది గనక చెబుతున్నాను."

ఎంత దేశభక్తి! ఎంత ఇదీ!

అంత అద్దె పుచ్చుకుంటూ, ఈ వెధవ వేషాలేమిటి? ఒళ్ళు ఉడికిపోయింది నాకు.

కాని, పైకి ఏమైనా అనగలిగాననా? అబ్బే! అంత సాహసం ఎక్కడిదీ అద్దెకుండేవాడికి?

అక్కడుంటే, ఇంకా ఒళ్ళు మండిపోతుందని మళ్ళీ మాట్లాడకుండా బయటపడ్డాను. మర్నాడు మళ్ళీ ప్రవేశించటానికే సుమండీ!

సిగ్గూ, బిడియం, మానం, అభిమానం అనేవి ఉంటేగా, అద్దెకుండేవాడికి?

ఓ సారి కోపం వచ్చి, కర్రపుచ్చుకుని కాలు విరగ గొట్టినా, మళ్ళీ ఆర్పేసిన అదే నీళ్ళ పొయ్యిలోకి మనం అలా వెళ్ళగానే ఇలా వచ్చి, నాలుగు కాళ్ళూ ముడిచి పెట్టుకు పడుకుంటుంది, చూశ్లేదూ?

ఆవేళ రాత్రి పది గంటలవుతుంది. ఒకటే ఉరుములూ,మెరుపులూ. హోరున గాలి. కుండపోతగా వర్షం.

మా నెత్తిపైన టిన్‌రేకు బడబడలాడుతూంది పడుతూన్న వర్షానికి.

గాలికి రేకు ఎక్కడ లేచిపోతుందో, ఏమైపోతామో అని, "ఇంత మహానగరంలో ఎక్కడా కొంపలేనట్లు, మమ్మల్నిపట్టుకువచ్చి ఈగొడౌన్‌లో పడేశారు!"అంటూ మా ఆవిడ ఒక్కటే సతాయింపు! అక్కడికేదో వాళ్ళ మీద నాకు కక్షఉండి చేసినట్లు. నిజం చెప్పద్దూ, ఆ సతాయింపు చూసి, ఓ దశలో నాకూ ఒళ్ళు మండుకు పోయింది. 'ఇళ్ళకోసం ప్రసవవేదన అంత—బాధను గురించి ఆడవాళ్ళకు బాగా నాటుకుపోయేలా చెప్పాలంటే అదే ఉపమానం — అవస్థ పడ్డాను! కడుపులో చల్ల కదలకుండా, ఇంట్లో నీడపట్టున హాయిగా కూర్చున్న నీ కేం తెలుస్తుంది?' అని చొక్కా చేతులు పైకి మడుచుదాం అనుకున్నంత కోపం వచ్చింది. నాలో నాకే మళ్ళీ నవ్వు వచ్చింది. వచ్చిన కోపాన్నంతా దిగ మింగుకున్నాను. నిజం అంతే మరి. అర్ధ నూరు రూపాయలు గుంజుకుని,మరీ ఇంటావిడ నా అభిమానాన్ని కుళ్ళబొడిస్తే లేదు కానీ, కట్టుకున్న పెళ్ళాం కష్టాల్లో ఏవో నిష్ఠురాలాడిందని చొక్కా చేతులు పైకి మడ చటం ఏం మగతనం?

అద్దె కున్నవాళ్ళు, పాపం! ఏం ఇబ్బంది పడతారనో ఏమో కాని, వర్షం కొంచెం తగ్గుముఖం పట్టింది, కొంతసేపటికి.

తలుపు తీసి బయటికి తొంగి చూశాను. చిన్న మెరుపు ఒకాటి మెరిసి మాయమైంది. ఆ మెరుపులో మా వాటా కానుకుని ఓ చిన్న అరుగులా ఉన్నదానిమీద ఏదో ఓ మానవాకారం!

ఎవరదీ? ఇంత గాలీ, వర్షంలో ఇక్కడ ఏం చేస్తున్నట్లు? నాకు ఆశ్చర్యం, ఓ తరహా భయం, ఆందోళనా ఒక్కసారి కలగాపులగంగా కలిగాయి!

లోపలికి వెళ్ళి టార్చిలైటు తెచ్చి, అరుగుమీదికి లైటు వేసి చూశాను.

పీక్కుపోయిన మొహం. లోతుకు పోయిన కళ్ళు. ఎవడో ముడిచి పెట్టుకు కూర్చున్నాడు. తడిసి ముద్దయి పోయాడు. జడలు కట్టుకుపోయిన జుట్టు కొనలనుండి నీళ్ళు ఓడుతున్నాయి చుక్క చుక్కలుగా. ఓ పక్కనించి "ఉహూ, ఉహూ" అని ఊరికే తెగ వణికిపోతున్నాడు చలికి. ఒంటిమీద ఉన్న తడిసిపోయిన చింకి గోనెనే కొంచెం పైకి లాక్కున్నాడుకప్పుకుంటూన్నట్లు. పక్కనే ఓ అల్యూమినియం గిన్నె! తడిసి, అప్పడంలా అంటి పెట్టుకుపోయిన జోలె.

వాడే, అడుక్కు తినేవాడు! ఆవేళ నేను అద్దె కొంపల కోసం ఎవరి అడుగుజాడల్లో నడిచి వెళ్ళానో వాడే ! నెత్తిమీద టిన్‌రేకైనా లేనివాడు! చుట్టూ చూడు దేరిపోయిన గోడలయినా లేనివాడు! వాలా, అథవా, అద్దె కొంపకయినా నోచుకోనివాడు!

టార్చిలైటు వెదజల్లుతూన్న కాంతి దూలంలోకి కళ్ళప్పగించి చూస్తున్నాడు వాడు.

నేనూ ఒక క్షణంపాటు, తదేకంగా చూశాను వాడి కళ్ళల్లోకి.

ఆ కళ్ళల్లో ఆ నల్లగుడ్ల వెనకాల దేవుడూ, మానవుడూ! సృష్టీ, లోకం! బీదా, సాదా! పిన్నా, పెద్దా! కష్టం, సుఖం! సృష్టి రహస్యాన్నంతా ఆకళింపు చేసుకున్న ఓ తరహా వేదాంతధోరణిలో తొణికిసలాడుతూన్న భావన! మొహంమీద చర్మంలో పడ్డ ముడతల్లో మానవాళి రాతి గుండెల్లో మధువు, ఆర్ద్రత నింపే దీనత్వం!

అప్రయత్నంగా నా కళ్ళు చెమ్మగిల్లాయి.

ఇంత విశాల ప్రపంచంలో ఒక్క దిక్కుమాలిన వాడికి తల దాచుకుందుకు చోటు లేదు!

మా ఆవిణ్ణీ పిల్లల్నీ వంట గదిలో పడుకోమని చెప్పి, వాడి దగ్గిరిగా వెళ్ళి, జబ్బపట్టుకు లేపి, 'పదు' అన్నట్లు చూశాను వాడి కళ్ళల్లోకి.

యాంత్రికంగా నడిచాడు వాడు, నేను నడిపిస్తూంటే. లోపలికి తీసుకు వెళ్ళి, తుండుగుడ్డ ఒకాటి ఇచ్చి ఒళ్ళు తుడుచుకోమని, పెట్టె అడుగున ఉన్న పాతపంచె, చొక్కా తీసి ఇచ్చి కట్టుకోమన్నాను.

సందేహిస్తూ వాడు పొడి బట్టలు కట్టుకుంటూంటే నేలమీద చాప పరిచి పడుకోమన్నాను.

వాడింకా వణుకుతూనే ఉన్నాడు.

వేరే ఇంకో దుప్పటీ లేక, అలా చెప్పుకుందుకు అభిమానం ఎందుకూ, అద్దెకుండేవాడికి? — పక్కవేసిన దుప్పటీ తీసి వాడికి కప్పాను.

ముడంకెవేసి పడుకున్నాడు వాడు.

మెల్లిగా మంచంమీద నేనూ ఒరిగాను.

ఎప్పుడు కునుకు పట్టేసిందో, ఎప్పుడు తెల్లవారి పోయిందో?

"ఏడండీ, మీ ఫ్రెండూ?" పక్కమీదనించి లేస్తూన్న నన్ను చూసి ఖాళీ చాపవైపు చూపిస్తూ అంది మా ఆవిడ వెటకారంగా.

నేను వాణ్ణి అలా సత్కరించానని ఎత్తి పొడుపు! మా ఆవిడ దృష్టిలో అడుక్కు తినేవాడంటే అద్దెకుండేవాడికంటే అధముడని! అందుకనేగా వాణ్ణి లోపలికి తీసుకువస్తూంటే, 'నెత్తిమీది కెక్కించుకుంటున్నారు, జాగ్రత్త! ఉన్న ముంతా, చెంబూ కాస్త ఎత్తుకు వెళితే, రేపటినించి మనం వాడి పని చెయ్యవలసి వస్తుంది!' అన్నట్లు చూసింది!

ఆత్రంతో లేచి కూర్చుని, కళ్ళు నులుముకుని చూసేసరికి, నా కాళ్ళ దగ్గిర, రాత్రి వాడికి కట్టబెట్టిన పంచె, చొక్కా, తుడుచుకుందుకు ఇచ్చిన తుండుగుడ్డ, కప్పుకుందుకు ఇచ్చిన దుప్పటీ చక్కగా మడతపెట్టబడి ఓదానిమీద ఒకటి దొంతరగా పెట్టబడి ఉన్నాయి.

చాప చుట్టుపక్కల అంతా ఓసారి కలియ జూశాను. అల్యూమినియం గిన్నీ, జోలె, గోనెగుడ్డా అక్కడ లేవు.

అల్సేషియన్ సహవాసంతో పాటి మనుషులమీద కలియబడే బుద్ధులు వచ్చిన ఆ పెద్దమనిషీ, నిద్రా భంగమైందని నిప్పులు కురిపించిన ఆ బుద్ధిమంతుడూ, "కిరాయ్ కుందాండీ!" అని పొగడుకుంటూ ఆక్షేపించిన, పెట్టి పుట్టిన ఆ మహాఇల్లాలూ, అదును కని పెట్టి జేబులు పిండిన ఇంటావిడా, అడుక్కుతినేవాడి నిజాయితీని అనుమానించిన అద్దెకుండేవాడి పెళ్ళామూ నా కళ్ళల్లో ఓసారి గిర్రున తిరిగారు.

'మానవాళి నిచ్చెనలో పైమెట్టు నువ్వే!' ఆ ఖాళీ చాపలో అంతర్ధానమైన ఆ అడుక్కు తినే వాణ్ణిగూర్చి మరోసారి నా మనసులో రూపకల్పన చేసుకున్నాను. ★

## వాన కురిసింది

**చల్లా రాధాకృష్ణ శర్మ**

కురిసింది వాన<br>
కుండపోతగా.<br>
నిలిచింది నీరు<br>
పల్లాలలోను.<br>
వచ్చింది రాత్రి<br>
చలి ఎంతో వేసె.<br>
వినిపించె నాకు<br>
కప్ప బెకబెకలు.<br>
అరిచాయి కొన్ని<br>
ముదపప్ ముదపప్.<br>
అనసాగె కొన్ని<br>
బేరం సారం<br>
అనజొచ్చె కొన్ని<br>
మడకట్ మడకట్.<br>
బెకబెకమంటూ<br>
చకచక కప్పలు<br>
తాళము వేయగ<br>
కురిసెను వర్షము<br>
జోరున వర్షము. ★